## సమస్యల పరిష్కారానికి కృషి


కార్పొరేటర్ సుజాతనాయక్‌తో కాలనీవాసులు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని శ్రీరమణకాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శ్రీరమణ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూదిని వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ సమస్యలు పరిష్కరించాలని శనివారం కార్పొరేటర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సుజాతా నాయక్ మాట్లాడుతూ.. కాలనీలోని రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో కాంతారెడ్డి, మురళీధర్, శ్రీకాంత్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సన్మానం


వెంకటేశ్వర్లు గుప్తాను సన్మానిస్తున్న నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ప్రతిష్టను పెంచడంలో చొరవ చూపిన, పహడి షరీఫ్ మార్కెట్ అనుమతులు నిలిపివేత కోసం నిరంతరం కృషి చేసిన గడ్డి అన్నారం కమిటీ డైరెక్టర్ జిన్నం వెంకటేశ్వర్లు గుప్తాను పలువురు సన్మానించారు.శనివారం ఆర్‌కేపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీ రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్, సభ్యులు బండి మధుసూదన్ రావ్, భూపాల్ రెడ్డి, గుండా నరసయ్య, గట్ల రవీంద్ర ఏవి రావు, ఆనంద్, ప్రసాద్, దుర్గాప్రసాద్ సన్మానించారు.

## నియామకం


నవీన్‌కుమార్ యాదవ్

చైతన్యపురి: బీజేపీ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడిగా గంగబోయిన నవీన్‌కుమార్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రారపు శంకర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు వినోద్‌యాదవ్‌కు కృతజ్ఞతలు అన్నారు.

## బాలల సదనం సందర్శన


బాలలతో ముచ్చటిస్తున్న హుస్సేన్ జాటోతు

సైదాబాద్: జైల్‌గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనాన్ని నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ట్ ట్రైబ్స్ సభ్యుడు హుస్సేన్ జాటోతు సందర్శించారు. శనివారం సైదాబాద్‌లోని సదనానికి చేరుకున్న ఆయనకు జువైనల్ వెల్ఫేర్ డిపార్టమెంట్ అధికారులు బాలలకు అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. జైల్‌గార్డెన్‌లోని బాలల ప్రత్యేక సదనం, వీధిబాలల సదనాలను పరిశీలించి సౌకర్యాలు, అందుతున్న సేవలపై సంతృప్తిని వెలిబుచ్చారని జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు.

## నేటినుంచి కబడ్డీ పోటీలు

మహేశ్వరం: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పెండ్యాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ చాలెంజ్ కప్–2025 కీశే మదిలపురం ప్రేమలమ్మ, కీశే జైత్వారం నారాయణరెడ్డిల జ్ఞాపకార్థం నిర్వహించనున్నారు. మదిలపురం జగత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జైత్వారం రాజశేఖర్‌రెడ్డి, నవభారత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు.




రంగవల్లులను తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు, మహిళలు

# సంక్రాంతి కళ.. రంగవల్లులు భళా

- సాక్షి శ్రీసరస్వతీ పాఠశాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు
- విజేతలకు బహుమతులు

చంపాపేట: సంక్రాంతిని పురస్కరించుకుని రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువతులు, విద్యార్థుల చేతివేళ్ల నుంచి జాలువారిన రంగురంగుల ముగ్గులను చూసి ఆహుతులు మురిసిపోయారు. శనివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శుభోదయ కాలనీలోని భగత్‌సింగ్ క్రీడా మైదానంలో 'సాక్షి' కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, యువతులు, విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి ముగ్గుల పోటీల్లో పాల్గొని తమదైన శైలిలో ప్రతిభ కనబరిచారు.

### విజేతలు..

ముగ్గుల పోటీలలో 13 మంది మహిళలు, 65 మంది విద్యార్థినులు పాల్గొనగా మహిళలు, విద్యార్థినుల విభాగాల నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ విద్యావేత్త లెక్కల కృష్ణారెడ్డి, ఎల్‌బీనగర్ సాక్షి ఆర్‌సీ ఇన్‌చార్జి దశరథ చేతుల మీదుగా చీరలు, గోడ గడియారాలు, హ్యాండ్ బ్యాగులు, హాట్ బాక్సులను అందజేశారు. విద్యార్థినుల విభాగం లెవల్–01 నుంచి ప్రథమ బహుమతిని మానస, ద్వితీయ బహుమతిని శానవీ, తృతీయ బహుమతిని రోహిణ్, లెవల్–02 నుంచి ప్రథమ వి. రోహన్, సాతిక్ పాల్, ద్వితీయ బహుమతి శ్రీమాన్, తృతీయ బహుమతి ప్రవళిక, లెవల్–03 నుంచి ప్రథమ బహుమతి నేహా, ద్వితీయ సౌమ్య, తృతీయ మహుమతిని అపర్ణ కై వసం చేసుకున్నారు. మహిళా విభాగం నుంచి ప్రథమ బహుమతిని సెవన్ హిల్స్ కాలనీకి చెందిన లక్ష్మీప్రసన్న, ద్వితీయ బహుమతిని మీర్‌పేటకు చెందిన మాధురీ, మంజుల కై వసం చేసుకున్నారు.

### ఆలోజింపజేసేలా ముగ్గులు..

నేటి సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలే కాకుండా హిందూ, ముస్లిం, క్రైస్తవులు కలిసికట్టుగా ఉండాలనే ఆకాంక్షను అందమైన రంగులతో తీర్చిదిద్దిన రంగవల్లుల ద్వారా పోటీదారులు ఆలోజింపజేశారు. మరో విద్యార్థిని సంక్రాంతి పర్వదిన విశిష్టతను తెలిపే గొబ్బెమ్మలు, భోగిమంటలు, కడువలో పాల నురుగ, చెరుకు గడలు, హరిదాసులు, గంగిరెద్దులు, వరికంకులు, భోగి పండ్లు, నవధాన్యాలు, పతంగులతో పాటు జంతువులు, చెట్లు, నీటి సంరక్షణ, కాలుష్య నివారణ, సెల్‌ఫోన్ వాడకం, మద్యం, మత్తుపదార్థాలు సేవించటం వల్ల అనర్థాలు, వంటి సమాచారంతో కూడిన అందమైన రంగులతో తీర్చిదిద్ది అబ్బురపరిచారు. మరికొందరు విద్యార్థులు నూతన తెల్లని జరీ అంచువస్త్రాలతో పంచకట్టు వేషధారణలు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాల నడుమ భోగి మంటలు, పతంగుల పోటీలలో పాల్గొని సందడి చేయటంతో ఆ ప్రాంతంలో సంక్రాంతి పండుగ సంతరించుకుంది.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ మధుసూధన్‌రెడ్డి, లెక్కల కృష్ణారెడ్డి

### సంతోషంగా ఉంది..



సంక్రాంతి ముగ్గుల పోటీలలో పాల్గొనడం సంతోషంగా ఉంది. క్రీడా మైదానం మొత్తం పల్లె వాతావరణంతో నిండిపోయింది. తోటి స్నేహితులతో కలిసి పతంగులు, భోగి మంటలు వేసుకున్నాం. ఇలాంటి వేదిక కల్పించినందుకు సాక్షి, మా పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు.

– సాయిశ్రీజ, 10 తరగతి విద్యార్థిని

### మరిచిపోలేని రోజు..



అంతరించిపోతున్న సంస్కృతి, సాంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలిపేవిధంగా సాక్షి దినపత్రిక, శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాల నిర్వాహకులకు కృతజ్ఞతలు. మొదటి సారిగా ముగ్గుల పోటీలలో పాల్గొన్నప్పటికీ అంత మంది పోటీదారులలో కూడా ద్వితీయ బహుమతి దక్కడం నాకు మరిచిపోలేని రోజు.

– మాధురి, మీర్‌పేట

### 'సాక్షి' కృషి అభినందనీయం



క్రీడా మైదానం మొత్తం పల్లె వాతావరణం నిండుకుంది. మాఊర్లో ఉన్న అనుభూతే వచ్చింది. అంతరించిపోతున్న రంగువల్లులకు సాక్షి జీవం పోసినట్లు అయింది. పోటీలలో మొదటి స్థానం దక్కించుకున్నందుకు పొందిన సంతోషం కన్నా అందరితో కలిసి ముగ్గుల పోటీల్లో పాల్గొనటం మరచిపోలేని అనుభూతి. సాక్షి దినపత్రిక, శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాల నిర్వాహకుల కృషి అభినందనీయం. కులమతాలకతీతంగా ప్రతీ పర్వదినం అందరం ఒకే చోట చేరి వేడుకను చేసుకుంటే ఆ అనుభూతే వేరు.

– లక్ష్మీప్రసన్న, సెవన్‌హిల్స్ కాలనీ, మీర్‌పేట

## భక్తిశ్రద్ధలతో నీరాటోత్సవం


స్వామివారికి అభిషేకం చేస్తున్న పురోహితులు

మలక్‌పేట: ధనుర్మాస తిరుప్పావై ప్రవచనోత్సవాల్లో భాగంగా శనివారం మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో 'కుడారై వెల్లుంశీర్' నీరాటోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గోదా రంగనాథులకు 108 వెండి గంగాళాములతో 'అక్కారవ డిశల్' విశేష ప్రసాద నివేదన గావించారు. అనంతరం స్వామివారికి మంగళహారతులు సమర్పించారు. ఉ.వే. చింతాపట్టం జగన్మోహనా చార్యస్వామి వారు గోదాదేవి వైభవం గురించి ప్రవచనం చేశారు. నిర్వాహకురాలు లక్ష్మీదేవి, రూపాదేవి, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## వ్యవసాయ మార్కెట్‌కు రెండ్రోజులు సెలవు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఈ నెల 14, 15 తేదీల్లో సెలవు దినాలు ప్రకటించినట్లు ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. 16వ తేదీన మార్కెట్ యధావిధిగా వ్యాపారాలు కొనసాగుతాయన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

నాగోలు: రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన చేసుకున్నట్లయితే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని నాగోలు ఇన్‌చార్జ్ ఆర్టీఓ అమర్నాథ్ అన్నారు. రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా నాగోలులోని రాజీవ్‌గాంధీ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రోడ్డు భద్రత– ప్రమాదాల నివారణలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు శీతల్ చౌహాన్, విష్ణుదీపక్, అనిత, వేణు, ప్రసాద్, అభిలాష పాల్గొన్నారు.

## నిషేధిత మాంజాను వినియోగిస్తే చర్యలు


పోలీస్ అధికారులతో సమావేశమైన డీసీపీ కాంతిలాల్ పాటిల్ సుభాష్

సైదాబాద్: ప్రభుత్వం నిషేధించిన మాంజాలను వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్‌పాటిల్ సుభాష్ హెచ్చరించారు. శనివారం ఆయన సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో మాంజా కారణంగా పక్షులతో పాటు మనుషులకు కూడా ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు చైనా మాంజా విక్రయాలపై నిఘా పెంచామని ఎక్కడైనా వినియోగించారని గుర్తిస్తే డయల్ 100 లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ స్వామి, ఏసీపీలు వెంకన్న నాయక్, శ్యాంసుందర్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ పాల్గొన్నారు.

## వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: అఖిలభారత వడ్డెర సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి ఆధ్వర్యంలో శనివారం ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన వడ్డె ఓబన్న జయంతి వేడుకల్లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, అఖిల భారత వడ్డెర సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు కుంజ రేణుకా పాల్గొని ఓబన్న చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితా చేర్చాలని, రాజకీయంగా అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వడ్డె ఓబన్న జయంతిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారింగా నిర్వహించటం సంతోషకరమన్నారు. వడ్డెరులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారన్నారు. స్వాతంత్ర్య వీరుల చరిత్ర భావి తరలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, వడ్డె ఓబన్నలాంటి మహనీయుల పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి రాంచందర్, అవినాష్, శివరాత్రి రాములు, వినోద్ కుమార్, రవి, ప్రవీణ్‌కుమార్, శివరాజ్ పాల్గొన్నారు.

## రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..

టమాటా రూ.11, వంకాయ రూ.23, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.50, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.35, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.32, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.21, సొరకాయ రూ13, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.37, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.60, బీట్‌రూట్ రూ.35, కీర రూ.35, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.40.

ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

## చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు

చాదర్‌ఘాట్: టీకొట్లో పని చేస్తూ చెడు వ్యవసనాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని అరెస్టు చేసినట్లు హైదరాబాద్ సిటీ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ అందె శ్రీనివాసరావు వెల్లడించారు. వెస్ట్ బెంగాల్ రాష్ట్రం మునిపారకు చెందిన ఆసిఫ్ అలీ సయ్యద్ (66), బండ్లగూడ హషామాబాద్‌లోని ఓ టీ కొట్టులో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. విలాసవంత జీవితానికి అలవాటు పడిన అతడు గతంలోనూ 11 ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. అందులో ఒక కేసులో ఐదేళ్ల జైలు జీవితం కూడా అనుభవించాడు. జైలు నుంచి బయటకు వచ్చినా తన బుద్ధి మార్చుకోలేదు. చాదర్‌ఘాట్, హబీబ్‌నగర్ ప్రాంతాల్లో రెండు ఇళ్లలో దొంగతనాలు చేశాడు. ఈ కేసుల దర్యాప్తులో కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ సౌత్‌ఈస్ట్ జోన్ టీం, చాదర్‌ఘాట్ పోలీసులు సాంకేతిక సహాయంతో ఆసిఫ్ అలీ సయ్యద్‌గా గుర్తించి అరెస్టు చేశారు. 75 తులాల బంగారు ఆభరణాలు, నాలుగు చేతి వాచీలు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

## వ్యాధిరహిత సమాజానికి సహకరించాలి


సర్వేలో పాల్గొన్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: వ్యాధిరహిత సమాజాన్ని సాధించడానికి అందరూ సహకరించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి కోరారు. జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని శంకేశ్వరబజార్‌లో నిర్వహించిన ఫైలేరియాసిస్ (బోదకాలు) వ్యాధి నిర్ధారణ సర్వేలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. బోదకాలు వ్యాధి గుర్తించటానికి బస్తీవాసులు తమ రక్త నమూనాలను వైద్యశాఖ సిబ్బందికి ఇవ్వాలని అన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి నివారణకు అవసరమైన ఔషధాలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం పీహెచ్‌సీకి చెందిన సిబ్బంది మహేష్, నరేష్, ఆశవర్కర్లు సంధ్య, అనూష, కవిత, సుష్మ పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం సంక్రాంతి


కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ కృష్ణయ్య

- ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య

నాగోలు: మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం సంక్రాంతి పండగ అని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. నాగోలు శ్రీ సాయినగర్ సౌత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆయన ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలిసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బద్దం భాస్కర్‌రెడ్డి, ఉమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

**కొత్తపేటలో..**

బీజేపీ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కాట విజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌కుమార్, గీతారెడ్డి, జంగారెడ్డి, నాయినాథ్‌గౌడ్, రాధిక, వైజయంతి, లావణ్య, సంగీత, శివనేత పాల్గొన్నారు.

## వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం


మహిపాల్


నర్సింహా

హయత్‌నగర్: వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్, మలక్‌పేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. మునుగనూరు మల్లికార్జుననగర్‌కు చెందిన దోమలపల్లి మహిపాల్(32) పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం భార్యతో విడాకులు కావడంతో తల్లి దగ్గర ఉంటున్నాడు. ఈ నెల 7న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన మహిపాల్ తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో తల్లి ఆండాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

- హయత్‌నగర్ కల్సా ప్రాంతానికి చెందిన చేరిపల్లి నర్సింహా(85) గత గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి ఎంతకీ రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కొడుకు శ్రీనివాస్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### మలక్‌పేటలో..


ప్రవీణ్

మలక్‌పేట: ఇంటి నుంచి బయటకి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. మలక్‌పేట ఏఎస్సై తేజ్‌నాయక్ వివరాల ప్రకారం.. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని సలీంనగర్ కాలనీ కమ్యూనిటీహాల్ సమీపంలో నివాసముంటున్న ప్రవీణ్(36) ఈ నెల 8న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి ఎంతకీ రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో సోదరుడు రాకేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## కాంగ్రెస్ నాయకుల జోక్యం తగదు

8వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ ఇంద్రసేనా

బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని కొందరు స్థానిక కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకుల అనవసర జోక్యం తగదని 8వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ ఇంద్రసేనా హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మంజూరైన నిధులనుంచి 8వ డివిజన్‌లోని కోటగోడనుంచి రఘుహోమ్స్ కాలనీతో పాటు రోడ్డు విస్తరణకు, బీటీ రోడ్డు వేయుటకు రూ.30 లక్షలతో పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు. ఒకవైపునుంచి పనులు కొనసాగుతుంటే కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండి పడ్డారు. మిగిలిన పనులు సంక్రాంతి తర్వాత చేయిస్తానని కాంట్రాక్టర్ చెప్పినా వినకుండా వారు అడ్డగోలుగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పనులు జరుగుతున్నా కూడా కోటగోడనుంచి రఘువంశీ కాలనీ వరకు బీటీ రోడ్డు వేయాలని కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, అశోక్ తదితరులపై కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.